సాక్షి నారాయణపేట

బుధవారం । 25 । జూన్ । 2025



కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

జూరాల ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతుంది.

వివరాలు 8లో ▸



న్యాయం చేయండి

తమకు న్యాయం చేయాలని 'నక్కలగండి' ముంపు బాధితులు ఆర్డీఓను కోరారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.8 /22.5

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు



కోస్గి: స్కానింగ్ కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.శైలజ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, స్కానింగ్ సెంటర్లలో ఆమె ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా ఆస్పత్రుల్లో వైద్యుల అర్హత ధ్రువపత్రాలతో పాటు రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఫీజులపై ఆరా తీశారు. స్కానింగ్ సెంటర్లలో పరీక్షలకు సంబంధించిన ధరల పట్టిక ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్ణీత ధరల కంటే ఎక్కువ వసూలు చేస్తే స్కానింగ్ సెంటర్ల అనుమతులను రద్దు చేస్తామన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంట ఇన్‌చార్జి డెమో అధికారి శ్రీనివాస్ ఉన్నారు.

విద్యారంగాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం



నారాయణపేట: ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా గాలికొదిలేసిందని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప అన్నారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 27న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద చేపట్టనున్న ధర్నాకు సంబంధించి మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక భగత్‌సింగ్ భవన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014లో 6శాతం నిధులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం.. 2025 నాటికి 2.6శాతం నిధులతో సరిపెట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీకి విరుద్ధంగా కేవలం 0.6శాతం నిధులు పెంచి 7.6 శాతం నిధులు కేటాయించి విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 27న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద చేపట్టే ధర్నాలో విద్యా పరిరక్షణ కమిటీ భాగస్వామ్య సంఘాల బాధ్యులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు రామకృష్ణ, వెంకటప్ప బాలరాజ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, రాము, కృష్ణ మారుతి, వసుంధర, అనిత పాల్గొన్నారు.

నేడు మార్కెట్‌కు సెలవు

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుధవారం సెలవు కారణంగా ఉల్లి వేలం, ధాన్యం క్రయవిక్రయాలు జరగవని వ్యాపారులు తెలిపారు. బుధవారం అమావాస్య కావడంతో మార్కెట్ యార్డు బంద్ ఉంటుందని, దీనివల్ల ప్రతివారం జరిగే ఉల్లిపాయల బహిరంగ వేలం కూడా జరగదన్నారు. అయితే రైతులు నేరుగా వచ్చి మార్కెట్ బయట ఉల్లి విక్రయాలు కొనసాగించే అవకాశం ఉంది. మార్కెట్ యార్డులో తిరిగి గురువారం క్రయవిక్రయాలు కొనసాగుతాయి.

మాకేదీ 'పండుగ'..!

'భరోసా' రాని రైతుల్లో నిర్వేదం	అర్హులైనా.. లబ్ధి చేకూరకపోవడంపై నిరాశ	కాస్తు నమోదులో తప్పులతో పలువురికి అన్యాయం	క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే ఇష్టారాజ్యంగా వ్యవహారం	వ్యవసాయ అధికారులపై అన్నదాతల్లో ఆగ్రహం	ఉమ్మడి జిల్లాలో వేలాది మంది బాధితులు



ఈ ఫొటోలోని రైతు పేరు గుడిసె కిష్టప్ప. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట నియోజకవర్గ పరిధిలోని కోయిల్‌కొండ మండలం వింజమూరుకు చెందిన ఆయనకు గ్రామ శివారులో 3.20 ఎకరాల పట్టా భూమి ఉంది. ప్రస్తుతం ఈ భూమిలో కంది పంట సాగు చేస్తున్నాడు. ఐదేళ్లుగా ప్రతి సీజన్‌లో ఏదో ఒక పంట సాగు చేస్తూనే ఉన్నాడు. వానాకాలం సాగుకు సంబంధించి ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేయగా.. అవి వస్తాయనే ఆశతో ఎదురుచూశాడు. కనుక్కుందామని బ్యాంక్‌కు వెళ్లి ఆరా తీయగా.. పడలేదని అధికారులు చెప్పడంతో కంగుతిన్నాడు. వెంటనే వ్యవసాయ అధికారుల వద్దకు పరుగులు తీశాడు. పలుమార్లు బతిమిలాడడంతో వారు పరిశీలించి.. భూమిలో పంట వేయలేదని, కాస్తులో లేకపోవడంతో డబ్బులు పడలేదని చెప్పడంతో బోరుమన్నాడు. 'కొందరికి పూర్తి స్థాయిలో డబ్బులు వేశారు.. మాకేమో కొర్రీలు పెడుతున్నారు.. ఇంట్లో కూర్చుని, వ్యవసాయ భూములను పరిశీలించకుండానే కాస్తు లేదంటూ తప్పుగా నమోదు చేశారు. నాకు నష్టం చేశారు. ప్రభుత్వం రైతు పండుగ చేస్తోంది. నాలాంటి వారికి అధికారులు పండుగ లేకుండా చేశారు' అని వాపోయాడు.

..ఇది ఆ ఒక్క రైతు ఆవేదన మాత్రమే కాదు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని వేలాది మంది అన్నదాతలు నిరాశలో మునిగిపోయారు. దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదు అన్నట్లు తయారైంది వారి పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా 15 ఎకరాల వరకు పెట్టుబడి సాయం అందించినా.. వ్యవసాయ శాఖ నిర్లక్ష్యంతో అర్హులైన రైతులకూ మొండి చేయే మిగిలింది. సిబ్బంది ఇష్టారాజ్యంగా పంటల నమోదు.. అధికారుల పర్యవేక్షణ లోపం వారికి శాపంగా మారిన నేపథ్యంలో 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్



కోయిల్‌కొండ మండలం వింజమూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట అర్హులమైనా.. తమకు రైతు భరోసా రాలేదని తమ గోడును వెళ్లబోసుకుంటున్న రైతులు

క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే..



ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని ఐదు జిల్లాల్లో వ్యవసాయ శాఖ చేపట్టిన పంటల నమోదులో పలు తప్పిదాలు దొర్లినట్లు తెలుస్తోంది. పలు మండలాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది కనీస పరిశీలన చేయకపోవడం.. ఇష్టారాజ్యంగా పంటల నమోదుతో అర్హులైన వారు సైతం రైతు భరోసాకు దూరమైనట్లు స్పష్టమవుతోంది. ఐదారేళ్లకు పైనుంచి ప్రతి ఏటా వివిధ పంటలు సాగు చేస్తున్నా.. కొన్ని మండలాల్లో పలువురికి పూర్తిస్థాయిలో రైతు భరోసా అందలేదు. ఇంకొందరికి సాగు చేస్తున్న దాంట్లో కొంత విస్తీర్ణానికి మాత్రమే వారి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమయ్యాయి. దీంతో ఆయా రైతుల్లో నిరాశ నిస్పృహలు అలుముకున్నాయి. ఈ వానాకాలం సీజన్‌లో ఎకరాకు రూ.6 వేల చొప్పున ప్రభుత్వం అందజేస్తున్న సాయం.. అధికారుల తప్పిదాలతో అందకుండాపోయాయని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కమిషనరేట్ నుంచే అంటూ

అర్హులైన వారికీ రైతు భరోసా అందని నేపథ్యంలో ఆయా జిల్లాల్లోని వ్యవసాయ శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా.. ఇంట్లో, ఆఫీస్‌లో కూర్చునే పంటల నమోదు చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో వ్యవసాయ అధికారుల వద్ద వారు ఆరా తీశారు. 'వరుసగా నాలుగేళ్లు సాగు చేయకుంటే రైతు భరోసాకు అర్హులు కారు. పంటల నమోదులో మేము ఎక్కడా నిర్లక్ష్యంగా వ్యవహరించలేదు. గత యాసంగిలో ప్రభుత్వం నాలుగెకరాల వరకే రైతు భరోసా నిధులు విడుదల చేసింది. ఇప్పుడు 15 ఎకరాల వరకు ఇచ్చింది. ఈ క్రమంలో ఈ సారి పలువురు రైతులకు రైతుభరోసా అందనట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని వ్యవసాయ కమిషనరేట్‌లోనే కోతలు పడొచ్చు. మా తప్పు ఏం లేదు.' అని అధికారులు అంటున్నారని.. ఏం చేయాలో తోచడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు నారాయణపేట పట్టణానికి చెందిన డోగి అంజయ్య. పళ్లబురుజు శివారులోని 522 సర్వే నంబర్‌లో అతడికి 3.11 ఎకరాల భూమి ఉంది. 2023 వరకు ఆ రైతుకు రైతుబంధు పథకంతో పంట పెట్టుబడి సాయం అందింది. 2024–25 వానాకాలం రైతుభరోసా నిధులు బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. సదరు రైతు వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదిస్తే పంట వేయకపోవడంతో రైతుభరోసా నిలిచిపోయినట్లు అధికారులు చెప్పారు. తీరా ఆ రైతు తనకున్న 3.11 ఎకరాల్లో ఒక ఎకరాలో వరి, మరో 2.11 ఎకరాల్లో పంటమార్పిడి చేస్తూ జొన్న, మొక్కజొన్న ఇతర పంటలు సాగుచేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. తనకు రైతుభరోసా అందించాలని వ్యవసాయ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

సాగవుతున్నా పడావుగా చూపించారు..

నాకు చౌదర్‌పల్లిలో 4.02 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. బోరు సాయంతో పంటలు సాగు చేస్తున్నాం. నా బ్యాంక్ ఖాతాలో రైతు భరోసా కింద రెండు గుంటలకు మాత్రమే డబ్బులు రూ.300 పడ్డాయి. అధికారులు భూమి పడావు (నాట్ కల్టివేటింగ్) కింద చూపించడంతో నాకు అన్యాయం జరిగింది.

– భాగ్యమ్మ, చౌదర్‌పల్లి, దేవరకద్ర

అర్హులైన రైతులందరికీ న్యాయం చేయాలి..

2021, 22, 23లో పంట వేసినట్లు ఉంటేనే ప్రభుత్వం 2025లో రైతు భరోసా పథకాన్ని అమలు చేసింది. చాలామంది రైతులు ఈ విషయం తెలియక పంట ఎన్‌రోల్‌మెంట్ చేసుకోలేదు. అలాంటి రైతు భూములను అధికారులు పడావుగా చూపించి రైతు భరోసా పథకం అమలుకు నోచుకోకుండా చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రజావాణిలో ఈ మేరకు వినతిపత్రం అందించాం. ప్రభుత్వం మానవతా దృక్పథంతో పునఃసమీక్షించి అర్హులైన రైతులందరికీ న్యాయం చేయాలి.

– పట్నం చెన్నయ్య, తెలంగాణ దళిత పాంథర్స్ అధ్యక్షుడు

30వ తేదీ వరకు పెట్టుబడి సాయం జమ



జిల్లాలో చాలా మంది రైతుల నుంచి రైతు భరోసా రావడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వారి నుంచి వివరాలు సేకరిస్తున్నాం. సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తాం. ఈనెల 30వ తేదీ వరకు రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ కానుంది. అప్పటికీ రైతు భరోసా పడని రైతులు ఎవరైనా ఉంటే వారి జాబితా రూపొందించి కలెక్టర్‌కు అందజేసి వారందరికీ కూడా పంట పెట్టుబడి సాయం అందేలా చూస్తాం.

– బి.వెంకటేష్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

జిల్లాల వారీగా రైతులకు అందిన సాయం ఇలా (మంగళవారం వరకు)..

జిల్లా	మొత్తం రైతులు	నిధులు (రూపాయల్లో)	ఇప్పటి వరకు లబ్ధి చేకూరిన రైతులు	జమ అయిన మొత్తం (రూపాయల్లో)
మహబూబ్‌నగర్	2,54,059	255.48 కోట్లు	2,08,486	230.09 కోట్లు
నాగర్‌కర్నూల్	3,34,835	429.31 కోట్లు	2,92,539	394.38 కోట్లు
వనపర్తి	1,96,683	212.11 కోట్లు	1,71,405	196.49 కోట్లు
జోగుళాంబ గద్వాల	1,83,830	271.57 కోట్లు	1,64,436	244.33 కోట్లు
నారాయణపేట	1,83,500	262.19 కోట్లు	1,79,688	261.47 కోట్లు

లక్ష్యం మేర మొక్కలు నాటాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే లక్ష్యాన్ని శాఖల వారీగా నిర్దేశించినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై మంగళవారం అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ, సీఎస్ కె.రామకృష్ణారావు కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వీఐపీలు మొక్కలు నాటేందుకు 21 ప్రాంతాలను గుర్తించినట్లు చెప్పారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే విధంగా జిల్లాలో ఆయిల్‌పాం తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు తోటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. వానాకాలం సాగు నేపథ్యంలో ఎరువులు, విత్తనాల దుకాణాలను నిత్యం తనిఖీలు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. వీసీలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ట్రెయినీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డీఏఓ జాన్ సుధాకర్, డీఆర్డీఓ మొగులప్ప, హౌసింగ్ పీడీ శంకర్, జిల్లా వైద్యాధికారి జయచంద్రమోహన్ తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్ అంధకారం



మాట్లాడుతున్న ఎస్పీ యోగేశ్ గౌతమ్

మక్తల్: మాదకద్రవ్యాలకు అలవాటుపడిన వారి భవిష్యత్ అంధకారంగా మారుతుందని.. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని ఎస్పీ యోగేశ్ గౌతమ్ సూచించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం మక్తల్ పట్టణంలోని బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థి దశ జీవితానికి అత్యంత కీలకమైనదన్నారు. ఈ సమయంలో మత్తుకు బానిస కావొద్దన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద కొందరు చాకెట్ల రూపంలో మత్తు పదార్థాలను విక్రయిస్తున్నారని.. అలాంటి వారిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాలు వినియోగించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. జిల్లాలో అందరి సహకారంతో మాదకద్రవ్యాలు, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపినట్లు తెలిపారు. ఎక్కడైనా డ్రగ్స్, గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలిస్తే 1908 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించడంతో పాటు పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిపై ఆరా తీశారు. డయల్ 100కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని.. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీఐ రాంలాల్, ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి, డీవైఎస్‌ఓ వెంకటేశ్ శెట్టి, ఎంఈఓ అనిల్‌గౌడ్, ప్రిన్సిపాల్ రాములు పాల్గొన్నారు.

నారాయణపేట బంద్ సంపూర్ణం



ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేపట్టిన బీజేపీ నాయకులు

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని అర్ధాంతరంగా అప్పక్‌పల్లి సమీపంలో ఉన్న మెడికల్ కళాశాల భవనంలోకి తరలించడాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన నారాయణపేట బంద్ విజయవంతమైంది. బీజేపీ జిల్లాశాఖ పిలుపు మేరకు వ్యాపారులు, ప్రజలు బంద్‌కు సంపూర్ణంగా మద్దతు తెలిపారు. ఉదయం 6 గంటలకే ఆర్టీసీ డిపో ఎదుట బీజేపీ నాయకులు, కార్యకర్తలు బైఠాయించి.. ఒక బస్సు కూడా డిపో నుంచి కదలకుండా ధర్నా చేపట్టారు. జిల్లా ఆస్పత్రిని యథాస్థానంలో ఏర్పాటు చేసేంత వరకు తమ ఆందోళన ఆగదని నినాదాలు చేశారు. మధ్యాహ్నం 2:30 గంటల వరకు డిపో నుంచి బస్సులు బయటికి రాకుండా ఆర్టీసీ బస్టాండ్‌లోనే కూర్చున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగురావు నామాజీ, జిల్లా అధ్యక్షుడు కొండా సత్యయాదవ్, పట్టణ అధ్యక్షుడు వినోద్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ నందు నామాజీ, కేంద్ర సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్, రఘురామయ్యగౌడ్, సిద్ధి వెంకట్రాములు, మిర్చి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో మున్సిపల్ కమిషనర్ల బదిలీ

- నలుగురు ఎస్‌ఐలకు గ్రేడ్–3 కమిషనర్లుగా పదోన్నతి
- వెయిటింగ్ లిస్ట్‌లో మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసన్, అశోక్‌రెడ్డి
- నాగర్‌కర్నూల్ మున్సిపల్ కమిషనర్‌గా నాగిరెడ్డి

నాగర్‌కర్నూల్/మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాష్ట్రవ్యాప్త బదిలీలలో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కొందరు మున్సిపల్ కమిషనర్లకు స్థానచలనం కలగగా, మరికొందరికి పదోన్నతి లభించింది. ఈ మేరకు మంగళవారం సీడీఎంఏ టీకే శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ (గ్రేడ్ –2)గా పనిచేస్తున్న టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మహబూబ్‌నగర్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డి.మహేశ్వర్‌రెడ్డికి ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా వెయిటింగ్‌లో ఉంచారు. వనపర్తి జిల్లాలోని అమరచింత కమిషనర్ (గ్రేడ్–1)గా పనిచేస్తున్న ఎం.రవిబాబును నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ అయింది. ఆయన స్థానంలో నల్లగొండ జిల్లా హుస్నాబాద్ మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సీహెచ్.నాగరాజు పదోన్నతిపై వస్తున్నారు. నాగర్‌కర్నూల్‌లో కమిషనర్ (గ్రేడ్–2) గా పనిచేస్తున్న బి.నరేష్‌బాబును మహబూబ్‌నగర్ జిల్లాలోని కొత్త మున్సిపాలిటీ అయిన దేవరకద్రకు పంపిస్తున్నారు. అక్కడికి మేడ్చల్ నుంచి నాగిరెడ్డి (గ్రేడ్–2) కమిషనర్‌గా వెళ్తున్నారు. అలంపూర్‌లో ఇన్‌చార్జ్ కమిషనర్‌గా పనిచేస్తున్న పి.చంద్రశేఖర్ పదోన్నతిపై కొల్లాపూర్‌కు బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న టి.శ్రీనివాసన్‌కు ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. అలంపూర్‌కు ఎవరినీ నియమించలేదు. మక్తల్‌లో ఇన్‌చార్జ్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎన్.శంకర్‌నాయక్‌ను అక్కడే రెగ్యులర్ అధికారిగా పదోన్నతి కల్పించారు. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న డి.మురళిని కమిషనర్‌గా (గ్రేడ్–3) పదోన్నతిపై అచ్చంపేటకు పంపిస్తున్నారు. ఇక్కడ ఇంతవరకు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా పనిచేసిన జి.యాదయ్య కోస్గికి మేనేజర్‌గా వెనక్కి వెళ్తున్నారు. మేడ్చల్‌లో రెవెన్యూ ఆఫీసర్ (ఆర్ఓ)గా పనిచేస్తున్న ఖాజా ఆరిఫొద్దీన్‌ను పదోన్నతిపై వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీ కమిషనర్ (గ్రేడ్–3)గా బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఎస్.అశోక్‌రెడ్డికి ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఇక మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏఎంసీగా పనిచేస్తున్న జె.పవన్‌కుమార్‌ను కమిషనర్ (గ్రేడ్–2)గా పదోన్నతిపై ముదుచింతలపల్లికి పంపిస్తున్నారు. ఇక్కడికి ఏఎంసీగా ఎ.రాజన్న పదోన్నతిపై వస్తున్నారు. అలాగే పాలమూరులో శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న యు.గురులింగం పదోన్నతిపై ఆందోల్–జోగిపేట మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్–3) గా, డి.వాణికుమారి జీహెచ్ఎంసీలో అసిస్టెంట్ ఎస్టేట్ ఆఫీసర్‌గా, కె.రవీందర్‌రెడ్డిని నల్లగొండ మున్సిపాలిటీ ఏఎంసీ కమిషనర్ (గ్రేడ్–3) గా పంపించారు.

పీయూలో లా, ఇంజినీరింగ్ కళాశాలలు

- ఆమోదం తెలిపిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్
- వసతుల కల్పన, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది నియామకానికి సైతం అనుమతులు
- నాన్‌టీచింగ్ సిబ్బంది వేతనాల పెంపుపై చర్చ
- రెగ్యులర్ అధ్యాపకులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో నూతన కళాశాలలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు నిర్వహించేందుకు అధికారులు వేగంగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో సెక్రెటరియేట్‌లో పీయూకు సంబంధించి ఈసీ (ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక, విద్యా శాఖల అధికారులతో పాటు పీయూ వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్ బాబుతోపాటు అధికారులు పాల్గొన్నారు. ఈ మేరకు సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా పీయూలో నూతనంగా ప్రారంభించే లా, ఇంజినీరింగ్ కళాశాలలకు ఈసీ ఆమోదం తెలిపింది. అలాగే విద్యార్థులకు కల్పించే వసతులు, ఇతర సదుపాయాలు ఉన్నాయి. ఇక టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది నియామకానికి సంబంధించి ఆమోదం కూడా జరిగింది.

137 మంది సిబ్బంది..

పీయూలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ సిబ్బంది వేతనాల పెంపుపై ఈసీలో చర్చ జరిగింది. తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న మొత్తం 137 మంది సిబ్బంది వివరాలను ఇప్పటికే అధికారులు ఈసీ ముందు ఉంచగా దీనిపై పలు ప్రశ్నలు అడిగారు. ఇందులో పీయూలోని పీజీ కళాశాల ప్రారంభంలో ఇచ్చిన జీఓ, గద్వాల, వనపర్తి, కొల్లాపూర్ వంటి పీజీ కళాశాలల ఏర్పాటు క్రమంలో ఇచ్చిన జీఓ సిబ్బంది నియామకానికి ఇచ్చిన అనుమతులపై ఈసీలో ప్రభుత్వ అధికారులు ప్రశ్నించారు. దీనిపై పీయూ అధికారులు పూర్తిస్థాయిలో వారు అడిగిన వాటికి సమాచారం అందించారు. ఈ క్రమంలో ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటే త్వరలో నాన్ టీచింగ్ సిబ్బంది వేతనాలు పెరిగే అవకాశం ఉందని, ఇందుకోసం పూర్తిస్థాయిలో ప్రయత్నిస్తున్నట్లు వీసీ చెప్పారు.

కానీ, ఆర్థిక శాఖ అనుమతి రావాల్సి ఉందని వీసీ పేర్కొన్నారు. అంతేకాకుండా పీయూలో పనిచేస్తున్న రెగ్యులర్ సిబ్బందికి మెడికల్ రీయింబర్స్‌మెంట్ అవకాశం కల్పించే దానికి కూడా అనుమతించారు.

పాలమూరు అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి



బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న ఎంపీ డీకే అరుణ, నాయకులు

పాలమూరు: ఎంపీగా ఈ ఏడాదిలో పాలమూరు అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశానని ఎంపీ డీకే అరుణ అన్నారు. ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీగా ఏడాది పాలన సంతృప్తినిచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విజయవంతమయ్యామని, ఏడాదిలో రూ.562 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు వెల్లడించారు. జడ్చర్ల నుంచి రాయిచూర్ రోడ్ నాలుగు లైన్లుగా విస్తరించడానికి కేంద్రం అంగీకరించిందని, ఎన్‌హెచ్–44 6 లైన్లు అప్‌గ్రేడ్ చేశారని, కల్వకుర్తి హైవే పనులను ఇటీవల కేంద్రమంత్రి గడ్కరీ ప్రారంభించినట్లు చెప్పారు. నారాయణపేట మీదుగా ఎన్‌హెచ్–167 కర్ణాటక వరకు వెళ్లే రోడ్డు నాలుగు లైన్లు అభివృద్ధి చేస్తామన్నారు. మెడికల్ కళాశాలల్లో వాటాలుగా నిధులు విడుదలలో కేంద్రం సానుకూలంగా ఉందన్నారు. 70 ఏళ్లు దాటిన వారందరికీ ఆయుష్మాన్ భారత్ కార్డు ఇప్పించేలా కృషి చేస్తానన్నారు. విద్యాపరంగా ఎన్నికల హామీ మేరకు ఇంజినీరింగ్, లా కళాశాలల ఏర్పాటు, నవోదయ, సైనిక్ స్కూళ్లు తెచ్చుకున్నామన్నారు. అమృత్ స్టేషన్‌లలో భాగంగా పార్లమెంట్ పరిధిలో రూ.39.87 కోట్లతో మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్, మరో రూ.10.94 కోట్లతో జడ్చర్ల, రూ.9.59 కోట్లతో షాద్‌నగర్ రైల్వేస్టేషన్లలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. కృష్ణ– వికారాబాద్ రైల్వేలైన్ పనులు త్వరలో ప్రారంభమవుతాయని, మహబూబ్‌నగర్ మీదుగా వందే భారత్‌ను ప్రారంభించుకున్నట్లు వివరించారు. అమృత్ స్కీం కింద పార్లమెంట్ పరిధిలోని అన్ని మున్సిపాలిటీలకు రూ.400 కోట్లు మంజూరయ్యాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పనులు కొనసాగుతున్నాయన్నారు. కేంద్ర మంత్రుల సహకారంతో పాలమూరు అభివృద్ధి విషయంలో రాజీలేని పోరాటం చేస్తానన్నారు. అనంతరం 'వికసిత్ భారత్‌లో పాలమూరు నియోజకవర్గం' పేరుతో బుక్‌లెట్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పద్మజారెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నారాయణపేట: మండలంలోని పేరపళ్ల, సింగారం, శేర్నపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతు పనుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సాయినాథ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేరపళ్ల ఫీడర్ పరిధిలో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు.. సింగారం, శేర్నపల్లి ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

ఆ బ్యాంకు ఉద్యోగి ఎక్కడ?

తేజేశ్వర్ హత్య కేసులో ప్రధాన నిందితుడి కోసం పోలీసుల గాలింపు

- దేశం విడిచి వెళ్లేందుకు ప్రయత్నం ...దీంతో లుక్ అవుట్ నోటీసు జారీ
- అనుమానితుల కుటుంబ సభ్యులను విచారిస్తున్న పోలీసులు
- నిందితుడి బ్యాంకు ఖాతాలు సీజ్
- హైదరాబాద్‌లో ఉన్నట్లు అనుమానం



ఈ నెల 17న తేజేశ్వర్ ఎక్కిన గుర్తుతెలియని కారు ఇదే..

గద్వాల క్రైం: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రానికి చెందిన ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో ప్రధాన నిందితుడి కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. ఈ క్రమంలోనే అతనికి సంబంధించిన బ్యాంకు ఖాతాలు సీజ్ చేసినట్లు తెలిసింది. మంగళవారం విచారణ అధికారులు డీఎస్పీ మొగిలయ్య, సీఐ శ్రీను కర్నూలు జిల్లాకు చెందిన ప్రధాన నిందితుడైన బ్యాంకు ఉద్యోగి తల్లిదండ్రులు, భార్యను వేర్వేరుగా రెండు గంటలకుపైగా విచారించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో హత్య, వివాహేతర సంబంధం విషయమై ఇంట్లో ఏమైనా గొడవలు ఉన్నాయా.. వివాహేతర సంబంధం ఘటనలో మనస్పర్థలు చోటు చేసుకున్నాయా.. తదితర అంశాలను ఆరా తీసినట్లు సమాచారం. తేజేశ్వర్ భార్య సహస్ర , ఆమె తల్లి సుజాతతో ఆర్థిక విషయాలను సైతం ప్రశ్నించారని తెలుస్తోంది. అయితే ఇప్పటికే ఈ కేసులో తేజేశ్వర్ భార్య సహస్ర, తల్లి సుజాతలు పోలీసుల అదుపులో ఉండటంతో వారిని సైతం వారి ముందు పలు విషయాలను ఆరా తీసినట్లు తెలిసింది. అయితే ప్రధాన నిందితుడి తండ్రి కర్నూలు జిల్లాలోని పోలీసు శాఖలో ఏఎస్ఐ స్థాయిలో పనిచేసి పదవీ విరమణ చేసినట్లు గుర్తించారు. పోలీసుల అదుపులో ఉన్న అనుమానిత వ్యక్తుల కుటుంబసభ్యులను సైతం పోలీసులు విచారించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ కేసు విచారణలో పోలీసులు అదుపులోకి తీసుకునే క్రమంలో కొందరు దురుసుగా ప్రవర్తించినట్లు తెలిసింది.

నగదు మొత్తం విత్ డ్రా..

హత్య ఘటన అనంతరం ప్రధాన నిందితుడైన బ్యాంకు ఉద్యోగి సుఫారీ ఇచ్చిన వారికి రూ.2 లక్షలు అందజేసి.. అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అయితే తేజేశ్వర్ హత్యకు ముందే ప్రధాన నిందితుడు తన వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోంచి భారీ మొత్తంలో నగదు డ్రా చేసుకున్నట్లు తెలుస్తుంది. సుఫారీ ఇచ్చిన ముఠా సభ్యులను కలిసినప్పటి నుంచి తన కారులో హైదరాబాద్‌లోని తెలిసిన స్నేహితులు, బంధువులను కలిసి అక్కడి నుంచి విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నించినట్లు వినికిడి. అయితే పోలీసులు ముందుస్తుగానే ఎయిర్‌పోర్టు కార్యాలయానికి ప్రధాన నిందితుడికి సంబంధించిన వివరాలను చేరవేసి లుక్ అవుట్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అయితే ఈ విషయం సైతం ప్రధాన నిందితుడు తెలుసుకుని హైదరాబాద్ శివారులో తెలిసిన వ్యక్తుల ఇళ్లలో తలదాచుకున్నట్లు పోలీసులు గుర్తించారు.

అరెస్టుకు ముందే న్యాయవాదులు

తేజేశ్వర్ హత్య జరిగిన నేపథ్యంలో ఎప్పటికైనా అరెస్టు కావడం ఖాయమని గుర్తించిన ప్రధాన నిందితుడు న్యాయ నిపుణుల సలహాలు సైతం తీసుకున్నట్లు తెలిసింది. అయితే మిస్సింగ్ కేసు నమోదు చేయగా.. తేజేశ్వర్ కుటుంబ సభ్యులు అనుమానిత వ్యక్తుల వివరాలలో బ్యాంకు ఉద్యోగి పేరు కూడా చెప్పడంతో విచారణ అధికారులు ఫోన్ చేసి మాట్లాడారు. ఎఫ్ఐఆర్ నమోదు కాకముందే.. బ్యాంకు ఉద్యోగి తరఫున కర్నూలుకు చెందిన న్యాయవాదులు వచ్చి ఈ నెల 20వ తేదీన గద్వాల పోలీసుశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడడం గమనార్హం. ఎఫ్ఐఆర్ నమోదు కాకముందే న్యాయవాదులు రావడంతో పోలీసులే కంగుతిన్నారు. కాగా.. హత్య విచారణకు ఎన్నో అడ్డంకులు వస్తున్నాయి. హత్య చేసిన ముఠా సభ్యులు మారణాయుధాలను ప్రవహించే నదుల్లో పారవేసినట్లు తెలుస్తుంది. తేజేశ్వర్‌కు సంబంధించిన ల్యాప్‌టాప్ ఇతర వస్తువులను సైతం తుంగభద్ర లేదా కృష్ణానదిలో పడేసినట్లు భావిస్తున్నారు. కేసుకు సంబంధించిన కీలకమైన అంశాలు వెలుగులోకి రాకుండా ఓ పథకం ప్రకారం ముందుకు వెళ్లినట్లు తెలుస్తోంది.

అంతా తారుమారు..

తేజేశ్వర్‌ను హత్య చేసి భార్య సహస్ర, బ్యాంకు ఉద్యోగి లడక్ లేదా ఇతర దేశాలకు పారిపోయేందుకు ప్రయత్నించినట్లు సమాచారం . పోలీసులు వివిధ కోణాల్లో ఆయా విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో ఆర్థిక లావాదేవీలు జరగకుండా బ్యాంకు ఖాతాలను సీజ్ చేయడంతోపాటు విమానయాన కార్యాలయాలకు లుక్ అవుట్ నోటీసులు జారీ చేయడం, సహస్ర, ఆమె తల్లి సుజాత పోలీసుల అదుపులో ఉండడంతో కథ అంతా తారుమారైంది.

సహస్ర సోదరుడి మృతిపై అనుమానాలు..

తేజేశ్వర్ భార్య సహస్ర తమ్ముడి మృతిపై కూడా అనుమానాలు నెలకొన్నాయి. అక్క సహస్ర, తల్లి సుజాత వ్యవహారం గురించి పలుమార్లు సహస్ర తమ్ముడు హెచ్చరించినట్లు సమాచారం. అయితే ఈ విషయం కూడా బ్యాంకు ఉద్యోగితో చెప్పడంతో పాటు రెండు నెలల క్రితం సహస్ర సొంత తమ్ముడిని సైతం హత్య చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి అయితే హత్య చేసి.. అనారోగ్య కారణాలతోనే మృతి చెందినట్లు నమ్మించారని తేజేశ్వర్ కుటుంబసభ్యులు సైతం ఆరోపిస్తున్నారు.

■ ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్ దారుణ హత్యకు ప్రధాన వ్యక్తిగా బ్యాంకు ఉద్యోగి తండ్రి ఏపీ పోలీసుశాఖ కర్నూలు జిల్లాలో ఏఎస్ఐగా పనిచేశారు. ఈ క్రమంలో భూ సంబంధ దందాలో ఉన్నట్లు అప్పటి ఉన్నతాధికారులు విచారించి శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. అప్పటి నుంచి పూర్తిస్థాయిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే బ్యాంకు ఉద్యోగి తండ్రిపై రౌడీషీటర్ ఓపెన్ చేసినట్లు కర్నూలు పోలీసు రికార్డులు ఉన్నట్లు తేజేశ్వర్ కుటుంబసభ్యులు ఆరోపించారు. నేర చరిత్ర కలిగిన నేపథ్యమే ఈ హత్యకు దారి తీసి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

కీలక దశలో ఉంది..



తేజేశ్వర్ హత్య కేసు చాలా కీలక దశలో ఉంది. అయితే హత్యకు గల కారణాలు, హత్య చేసిన వారి వివరాలపై కూపీ లాగుతున్నాం. ఇప్పటి వరకు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకున్నాం. తాజాగా వారి కుటుంబసభ్యులను విచారించేందుకు పోలీసు సిబ్బంది చర్యలు చేపట్టారు. ప్రధాన నిందితుడు కోసం ఇప్పటికే పలు ప్రత్యేక బృందాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో గాలింపు చేపట్టాయి. తెలంగాణలోనే తలదాచుకున్నట్లు వస్తున్న వార్తలపై నిఘా ఉంచాం. దేశం విడిచి వెళ్లకుండా లుక్ అవుట్ నోటీసులు జారీ చేశాం. బ్యాంకు ఖాతాలను సీజ్ చేశాం. త్వరలో కేసు వివరాలను వెల్లడిస్తాం. – మొగిలయ్య, డీఎస్పీ, గద్వాల

న్యాయం చేయకుంటే ఆత్మహత్యలు చేసుకుంటాం


ఆర్డీఓను కలిసి సమస్యను వివరిస్తున్న కేశ్యతండా యువకులు

- ఇళ్లు, ఖాళీ స్థలాలను గుర్తించి నష్టపరిహారమివ్వాలి
- ఆర్డీఓతో నక్కలగండి ముంపు ప్రజల గోడు

అచ్చంపేట: 'కొందరు స్వార్థం వల్ల మాకు అన్యాయం జరగతోంది. అధికారులు చేసిన తప్పులతో ఆర్థిక నష్టం జరుగుతోంది. మా గోడు అలకించి న్యాయం జరిగేలా చూడాలి' అని ఎస్ఎల్‌బీసీలో భాగంగా నిర్మాణం చేపట్టిన నక్కలగండి రిజర్వాయర్ ముంపు గ్రామం కేశ్యతండా గ్రామస్తులు ఆర్డీఓ మాధవితో తమగోడును విన్నవించారు. మంగళవారం గ్రామానికి చెందిన యువకులు ఆర్డీఓను కలిసి తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. నక్కలగండి ప్రాజెక్టులో అచ్చంపేట మండలం మార్లపాడుతండా, కేశ్యతండా గ్రామాలకు చెందిన ప్రజల భూములు, ఇళ్లు పూర్తిగా ముంపునకు గురవుతున్నాయి. ఆయా గ్రామాలకు చెందిన ప్రజల భూములకు ప్రభుత్వం ఇప్పటికే పరిహారం చెల్లించింది. దీంతో పాటు ముంపునకు గురవుతున్న మార్లపాడు, కేశ్యతండా గ్రామంలోని ఇళ్లకు సైతం నష్టపరిహారం ఇస్తామని ప్రకటించారు. ఇళ్లకు, ఖాళీ స్థలాలతో కలిపి గజం చొప్పున నష్ట పరిహారం చెల్లిస్తామని నోటిఫికేషన జారీ చేశారు. 1989లో కేశ్యతండాకు చెందిన గిరిజనులకు ప్రభుత్వం 167 సర్వేనంబరులో 89 మందికి ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ చేసింది. రెవెన్యూ అధికారులు సదరు భూమికి సంబంధించి ఇళ్ల నిర్మాణం చూపకుండా అమ్మిన వ్యక్తిపై అదే భూమిని చూపించడం వల్ల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతో పాటు నష్టపరిహారం రాకుండా పోతోంది. ప్రస్తుతం పక్కా ఇళ్లకు మాత్రమే పరిహారం వస్తుందని, ఖాళీ స్థలం, ఇంటిస్థలానికి పరిహారం రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమిలో నిర్మించిన ఇళ్ల స్థలాలను వ్యవసాయ భూమిగా, అది కూడా గతంలో భూమిని అమ్మిన వ్యక్తి వారసులుగా చూపించారు. దీని వల్ల తండావాసులు ఇళ్లకు మినహా, మిగతా ఖాళీ స్థలానికి నష్టం పరిహారం రావడం లేదు. దీని వల్ల తమకు సుమారు రూ.40 కోట్ల మేరా నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ఇళ్లను మాత్రమే తమవిగా చూపించి, మిగతా స్థలాలను గతంలోని వ్యక్తి వారసులుగా చూపించడం వల్ల అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. వారసులమని చెప్పుకునే వారికి భూమి నష్టపరిహారం సొమ్ము రూ.22 లక్షలు వారి ఖాతాలో జమచేయడం సరైంది కాదని తెలిపారు. వారి నుంచి సొమ్ము రికవరీ చేసి తాము కొనుగోలు చేసిన ఇళ్ల స్థలం, ఇళ్లకు పరిహారం ప్రభుత్వం నిబంధనల మేరకు చెల్లించాలని కోరారు. దీని గురించి ఇప్పటికే అనేక మార్లు అధికారులను కలిసి విన్నవించామని, ఇప్పటికైనా న్యాయం చేయాలన్నారు. దీనిపై ఆర్డీఓ స్పందిస్తూ వీలైనంత త్వరగా గ్రామానికి వచ్చి మరోమారు సర్వే చేసి గ్రామస్తులకు న్యాయం చేస్తామని చెప్పారు. దీనిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని తహసీల్దార్ సైదులును ఆదేశించారు. దీంతో గ్రామస్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

క్లుప్తంగా

ఉరేసుకొని రైతు బలవన్మరణం


వేపూర్ గోపాల్ (ఫైల్)

కొత్తపల్లి: కడుపునొప్పి బరించలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొత్తపల్లి మండలంలోని దుప్పడి గట్టులో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. దుప్పడిగట్టు గ్రామానికి చెందిన వేపూర్ గోపాల్ (42) గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కడుపునొప్పి వచ్చినప్పుడు ఆర్ఎంపీలతో చూపించుకొని మందులు వాడేవారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున రోజువారిగా పొలానికి వెళ్లాడు. ఆ సమయంలో మరోమారు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో భరించలేక మామిడి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పొలానికి వెళ్లిన గోపాల్ ఇంటిక రాకపోవడంతో భార్య సత్యమ్మ కొడుకును పంపింది. పొలం వద్ద చెట్టుకు వేలాడుతున్న తండ్రిని చూసి వెంటనే వెళ్లి తల్లికి చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి గోపాల్ మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. ఈ సంఘటనపై మద్దూరు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిర్వహించారు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

భూత్పూర్: మండలంలోని పాతమొల్గరకు చెందిన నవీన్‌గౌడ్ (22) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు, బంధువుల కథనం ప్రకారం.. నవీన్‌గౌడ్ ఖిల్లాగణపురం, కొత్తకోటలోని వైన్స్ దుకాణాల్లో పనిచేస్తుండేవాడు. వైన్స్ దుకాణంలోని డబ్బుల లావాదేవీల కారణంగా ఒత్తిడికి తట్టుకోలేక ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని మృతిచెందాడు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

చెట్టు పైనుంచి పడి బాలుడికి గాయాలు


క్షతగాత్రుడు నవీన్

గండేడ్: చెట్టు పైనుంచి పడి ఓ బాలుడు గాయాల పాలైన ఘటన మండలంలోని సల్కర్‌పేట్‌లో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నవీన్ మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో సీతాఫలం చెట్టుకున్న పండ్లను తెంచడానికి పైకి ఎక్కాడు. ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడటంతో కాలికి గాయం కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో స్థానిక ఆస్పత్రి అటు నుంచి మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రైల్వే స్టేషన్లు, నడుస్తున్న రైళ్లలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న దొంగ రితేష్ హరిశ్చంద్ర ధోత్రేను మంగళవారం రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లా మత్కులి గ్రామానికి చెందిన ధోత్రే పలు చైన్ స్నాచింగ్ దొంగతనాలకు పాల్పడి దొరకకుండా తిరుగుతున్నాడు. మంగళవారం మన్యంకొండ రైల్వే స్టేషన్‌కు వెళ్లి తనిఖీలు చేస్తుండగా సమీపంలో అనుమానాస్పదకంగా తిరుగుతున్న ఐదుగురిని గుర్తించిన పోలీసులు పట్టుకోవడానికి ప్రయత్నించగా నలుగురు తప్పించుకున్నారు.

జూరాలకు 43 వేల క్యూసెక్కులు


జూరాల ప్రాజెక్టు నుంచి దిగువకు పారుతున్న వరద

- 7 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- 11 యూనిట్లలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ధరూరు/ఆత్మకూర్: ఎగువన కురుస్తున్న వర్షాలకు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వస్తున్న వరద స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం ప్రాజెక్టుకు 43 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ప్రాజెక్టు 7 క్రస్ట్‌గేట్ల తెరిచి 28 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. విద్యుదుత్పత్తికి 35,335 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315, భీమా లిఫ్ట్–1కు 650, ఆవిరి రూపంలో 45, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 306, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 200, సమాంతర కాల్వకు 850, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.721 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు తెలిపారు.

115.854 మి.యూ. విద్యుదుత్పత్తి..

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో మంగళవారం ఉత్పత్తి కొనసాగినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ 5 యూనిట్ల నుంచి 195 మెగావాట్లు, 54.320 మి.యూ, దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 61.534 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామని.. ఇప్పటి వరకు 115.854 మి.యూ. ఉత్పత్తి జరిగిందని వివరించారు.

రామన్‌పాదులో 1,019 అడుగులు..

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో మంగళవారం సముద్ర మట్టానికి పైన 1,019 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ, కుడి కాల్వలకు 920 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 850 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని.. రామన్‌పాడు జలాశయం కుడి, ఎడమ కాల్వలకు 45 క్యూసెక్కులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు 872 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు వివరించారు.

కోయిల్‌సాగర్‌లో 18.6 అడుగులు..

దేవరకద్ర: కోయిల్‌సాగర్ జలాశయంలో మంగళవారం సాయంత్రం వరకు 18.6 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు అధికారులు తెలిపారు. మరో 8 అడుగులు నీరు వస్తే పాత అలుగుస్థాయికి నీచేరుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు.

శ్రీశైలానికి 61,350 క్యూసెక్కులు..

దోమలపెంట: జూరాలలో మంగళవారం ఆనకట్ట గేట్లు పైకెత్తి, విద్యుదుత్పత్తి ద్వారా 61,350 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో నీటిమట్టం 858.6 అడుగుల వద్ద 101.6785 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

హాస్టల్ భవనం పైనుంచి దూకిన విద్యార్థి


కేజీబీవీ హాస్టల్ భవనం

వెన్నెముకకు గాయం


తరుణి

వనపర్తి రూరల్: జిల్లాకేంద్రంలోని మర్రికుంట సమీపంలో ఉన్న కేజీబీవీ హాస్టల్ భవనం పైనుంచి ఓ విద్యార్థిని దూకగా వెన్నుముకకు తీవ్ర గాయామైన ఘటన మంగళవారం చోటు చేసుకున్నట్లు ప్రిన్స్‌పాల్ లోహిత తెలిపారు. ఆమె కథనం మేరకు.. మండలంలోని కిష్టగిరికి చెందిన గొల్ల సంజీవ్ కుమార్తె తరుణి వారం కిందట కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో చేరింది. హాస్టల్‌లో ఉండి చదవడం ఆమెకు ఇష్టం లేక మూడురోజులుగా బాధపడుతుండటంతో ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. వారు సకాలంలో రాకపోవడంతో ఇంటికి పారిపోవాలని నిర్ణయించుకొని మంగళవారం తెల్లవారుజామున సుమారు 4 గంటల ప్రాంతంలో హాస్టల్ భవనం పైనుంచి కిందకు దూకింది. వెనుముకకు గాయం కాగా నొప్పితో అరువగా వాచ్‌మెన్, ఉపాధ్యాయురాలు అక్కడికి చేరుకొని ఎస్ఓకు సమాచారం ఇచ్చారు. ఆమె వెంటనే సిబ్బందితో కలిసి బాధితురాలిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చారు. డీఈఓ అబ్దుల్ ఘని, జీసీడీఓ శుభలక్ష్మి ఆస్పత్రికి చేరుకొని వైద్యులతో మాట్లాడారు. వారి సూచనల మేరకు వెంటనే హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు.

ప్రాణం తీసిన డ్రైవింగ్ సరదా


కాల్వలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్


మృతుడు వీరేశ్

గట్టు: సరదాగా ట్రాక్టర్‌ను పొలం దాకా తీసుకెళ్దామనుకున్న సరదా చివరికి ఆ యువకుడి ప్రాణాన్ని బలిగొన్న ఘటన మంగళవారం గొర్లఖాన్‌దొడ్డి సమీపంలో చోటుచేసుకున్నది. వివరాలిలా.. గ్రామానికి చెందిన వీరేశ్, బజారి స్నేహితులు. ఇద్దరు కలిసి మగ్గం(చేనేత) నేసేవారు. బజారి తన పొలంలో వరి నారును చల్లడానికి గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి ట్రాక్టర్‌ను తీసుకొని పొలానికి వెళ్లడానికి సిద్ధమయ్యాడు. వరినారు బస్తాలను ట్రాక్టర్‌పై వేసుకుని గొర్లఖాన్‌దొడ్డి నుంచి తప్పెట్లమొర్సు వైపున్న రోడ్డుపై బయలుదేరాడు. మధ్యలో వీరేశ్ తాను వస్తానని, ట్రాక్టర్‌ను నడుపుతానని, చెప్పి ట్రాక్టర్‌పైకి ఎక్కి, డ్రైవింగ్ సీటులో కూర్చున్నాడు. ట్రాక్టర్‌ను సరదాగా నడుపుకుంటూ వెళ్తుండగా.. కొంతదూరం వెళ్లిన తర్వాత కాల్వ ఉన్న చోటుకు చేరుకొగానే వేగంగా వెళ్తున్న ట్రాక్టర్‌ను అదుపు చేసే క్రమంలో సడన్‌గా సింగిల్ బ్రేక్‌ను తొక్కడంతో ట్రాక్టర్ ఒక్కసారిగా కాల్వలోకి దూసుకెళ్లింది. ట్రాక్టర్‌పై ఉన్న బజారి క్షణకాలంలో పక్కకు దూకి ప్రాణాలను కాపాడుకున్నాడు. ట్రాక్టర్ నడుపుతున్న వీరేశ్ (30) అక్కడిక్కడే మృతిచెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలను నమోదు చేసుకున్నారు.

మొసలి కలకలం


గట్టు మీద సేదతీరుతున్న మొసలి

మాగనూర్: మండల కేంద్రంలోని సమస్‌చెరువు (సబ్‌స్టేషన్ స్టేషన్ పక్కన గల చెరువు)లో కొన్ని రోజులుగా మొసలి కలకలం సృష్టిస్తోంది. ప్రతిరోజు మొసలి గట్టు మీద వస్తుందని, దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయభ్రాంతులకు గురవుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. గతంలో ఫారెస్టు అధికారులకు సమాచారమిచ్చిన తూతూ మంత్రంగా చర్యలు తీసుకున్ని వదిలేశారని పలువురు ఆరోపిస్తున్నారు. ఫారెస్టు అధికారులు మొసలిని బంధించి తరలించాలని కోరుతున్నారు.

అటవీశాఖ అధికారులకు నెమలి అప్పగింత


అటవీశాఖ సిబ్బందితో నెమలి

పాన్‌గల్: అటవీశాఖ అధికారులకు జాతీయ పక్షి నెమలిని అప్పగించిన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ప్రత్యేక సాక్షులు, అటవీశాఖ అధికారుల వివరాల ప్రకారం.. పాన్‌గల్ సమీపంలో గుట్ట నుంచి నెమలి వచ్చి రాధాకృష్ణ ఇంట్లోకి వెళ్లింది. ఈ విషయం ఇంటి యజమాని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు తమ సిబ్బందితో వచ్చి నెమలిని తీసు కెళ్లారు. గుట్ట నుంచి వచ్చిన నెమలిని సురక్షితంగా అటవీశాఖ అధికారులకు అప్పగించడంతో ఇంటి యజమాని రాధాకృష్ణను అటవీశాఖ అధికారులు అభినందించారు.

నల్లమలలో గొర్రెల కాపరి అదృశ్యం

మన్ననూర్: నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్ మండలంలోని మాదారం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి గంగెడ్ల బాలయ్య మంగళవారం నల్లమల అటవీ సరిహద్దు ప్రాంతం కుడిచింతలబైలు గ్రామం సమీప అడవిలో తప్పి పోయినట్లు సమాచారం. వివరాల ప్రకారం.. కొంతమంది గొర్రెల కాపరులు కొన్ని రోజుల నుంచి కుడిచింతలబైలు గ్రామం సమీపంలోని రేవువాగు సమీపంలో గొర్రెలను మేపుతున్నారు. ఈ క్రమంలో అప్పుడప్పుడు వారికి కావాల్సిన వస్తువులు, నిత్యవసరాలు తదితరాల కోసం గ్రామానికి వస్తుంటారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం గ్రామానికి వచ్చిన బాలయ్య మద్యం తాగి గొర్రెల మంద వద్దకు తిరిగి వెళ్లాడు. రాత్రి ఎంతకూ తిరిగి మంద వద్దకు చేరుకోకపోవడంతో తోటి గొర్రెల కాపరులు తెల్లవారుజామున కుడిచింతలబైలుకు గ్రామంలోని ఇద్దరు వ్యక్తుల సహాయంతో రోజంతా అడవిలో వెతికిన బాలయ్య జాడ దొరలేదని తెలిపారు.

నల్లమల అడవిలోకి కొండచిలువ


నల్లమల అటవీ ప్రాంతంలో వదులుతున్న 13 అడగుల భారీ కొండచిలువ

మన్ననూర్: వనపర్తి జిల్లా గోపాల్‌పేట పరిసర ప్రాంతంలో బంధించిన 13 అడుగుల కొండ చిలువను నల్లమల అటవీ లోతట్టు ప్రాంతంలో మంగళవారం వదిలారు. వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం గోపాల్‌పేట మండల కేంద్రంలో అవుసలకుంటలో భారీ కొండచిలువను సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్ బంధించాడు. కొండ చిలువను సురక్షితంగా వదిలేయానే క్రమంలో సంబంధిత డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డిని సంప్రదించారు. దీంతో స్పందించిన ఆయన శ్రీశైలం ప్రధాన రహదారి సమీపంలోని నల్లమల అడవిలోకి తీసుకొచ్చి వదిలేయాలని సూచించారు. దీంతో కొండచిలువను ఓ ప్రత్యేక వాహనంలో తరలించి మద్దిమడుగు ఎఫ్ఆర్ఓ మహేందర్, మన్ననూర్ సెక్షన్ ఆఫీసర్ శ్రీకాంత్, బీట్ ఆఫీసర్ ఆనంద్, శివ సమక్షంలో పిచ్చకుంట్ల చెరువు నల్లమల అటవీ పరిసర ప్రాంతంలో వదిలేశారు. సకాలంలో స్పందించిన డీఎఫ్ఓకు కృష్ణసాగర్‌తో పాటు సొసైటీ సభ్యులు గోవర్ధన్, విష్ణుసాగర్, ఆనంద్, నాగరాజు, సురేష్, ప్రకాష్ రాజు, సూరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అడవి పందులను వేటాడిన నిందితుల అరెస్ట్


అడవి పందులను వేటాడిన నిందితులను అదుపు లోకి తీసుకున్న పోలీసులు

నారాయణపేట క్రైం: జిల్లా సరిహద్దులోని జలాల్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద సోమవారం అర్ధరాత్రి పట్టణ పోలీసుల ముమ్మర తనిఖీలో కర్ణాటకకు చెందిన ఓ బొలెరో వాహనంలో నాలుగు అడవి పందులను తరలిస్తున్నట్లు గుర్తించారు. ఆ వాహనాన్ని అదుపులోకి తీసుకొని విచారించగా, దేవదుర్గా తాలూకా భూమన కొండకు చెందిన 11మంది వేట కుక్కల సహాయంతో యానగుంది, దామరగిద్ద పరిసర ప్రాంతాల్లో పందులను వేటాడి కర్ణాటక దేవదుర్గాకు తరలిస్తుండగా నారాయణ పేట సీఐ శివ శంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. అప్పటికే అడవి పందులు వేటకుక్కల దాడిలో చనిపోయినట్లు తెలిపారు. వేటాడిన అడవి పందులను, వాటిని తరలిస్తున్న బొలెరో వాహనం , డ్రైవర్ అప్పన్నతో పాటు ఎల్లప్ప అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మిగతా వ్యక్తులు పోలీసులను చూసి వేట కుక్కలతో సహ పారిపోయినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న పందులకు వెటర్నరీ డాక్టర్‌తో పోస్టుమార్టం నిర్వహించి 12 మంది నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

11మంది పేకాటరాయుళ్లపై కేసు నమోదు

లింగాల: మండల కేంద్రానికి సమీపంలో ఓ వ్యవసాయ పొలంలో పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో మంగళవారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా పేకాడుతున్న 11మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఘటనా స్థలంలో రూ.20, 020 వేల నగదు పట్టుబడగా మరో మూడు బైకులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. పొలాల్లో పేకాడడం, మద్యం సేవించడం అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని, అంతేగాక పొలం యజమానులపై కూడా కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు.

తేనెటీగల దాడి.. నలుగురికి గాయాలు


గండేడ్‌లో బాధితులకు చికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది

గండేడ్: తేనెటీగల దాడిలో నలుగురు మేకల కాపరులకు గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం మండలంలోని కొంరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన నేతి వెంకటయ్య, అమృతమ్మ, బాలమ్మ, నర్సమ్మ తమ మేకలను మేపడానికి వెంకటయ్య పొలానికి వెళ్లారు. వెంకటయ్య పొలం వద్ద చెట్లు కొడుతుండగా కొమ్మ విరిగి పక్కనే మరో చెట్టుపై ఉన్న తేనె తెట్టపై పడింది. దీంతో ఒక్కసారిగా తేనెటీగలు లేచి వారి తల, ముఖాలపై కరిచాయి. కాసేపటికి అక్కడి నుంచి తేనెటీగలు వెళ్లిపోవడంతో గ్రామస్తులు వారిని ఆటోలో చికిత్స నిమిత్తం గండేడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అటు నుంచి అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.